# బీసీల ఐక్యతను చాటుతాం

### చేవెళ్ల గడ్డపై కాసాని గెలుపును ఎవరూ ఆపలేరంటున్న బీసీ సంఘాల నేతలు



చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని బీసీ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఎవరెన్ని కుట్రలు చేసినా.. కాసాని గెలుపును ఎవరూ ఆపలేరని నేతలు తేల్చి చెబుతున్నారు. బీసీ నేతకు వచ్చిన అవకాశాన్ని బడుగు, బలహీనవర్గాలు ఈ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోవని వారు పేర్కొంటున్నారు. బీసీల పట్ల చులకన భావంతో మాట్లాడుతున్న నేతల నోళ్లకు తాళం వేస్తామని హెచ్చరిస్తున్నారు. పార్టీలకతీతంగా కాసాని గెలుపునకు కృషి చేసేలా ప్రతి బీసీ ఓటరును చైతన్యపరుస్తామని చెబుతున్నారు. ఎంతోకాలంగా బీసీల ఐక్యతకు ఎనలేని కృషి చేస్తున్న ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు బీసీలంతా మద్దతుగా నిలువాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేస్తున్నారు. అటువంటి వ్యక్తిని గెలిపించుకుంటే బీసీలోని అన్ని కులాలకు సముచిత న్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు. చేవెళ్ల గడ్డపై బీసీల ఐక్యతను చాటుదామని పిలుపునిస్తున్నారు. - రంగారెడ్డి, మే 1(నమస్తే తెలంగాణ)

### బీసీ నేతను గెలిపించుకుందాం



పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటే బీసీల సమస్యల కోసం పోరాటం చేస్తారు. కాంగ్రెస్, బీజేపీలు బీసీలను పట్టించుకోవడంలేదు. బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. చేవెళ్ల గడ్డపై కాసానికి ఇచ్చిన అవకాశాన్ని బీసీలందరూ వినియోగించుకుని భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దాం. - బండారి దేవేందర్‌యాదవ్, సోలీపేట్(షాబాద్)

### బీసీలంతా ఏకతాటిపైకి రావాలి



లోక్‌సభ ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి ఓటు ద్వారా కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి. బీఆర్‌ఎస్ తరఫున పోటీలో ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్నది. అలాంటి బీసీ నాయకుడు చేవెళ్లకు ఎంపీగా గెలిస్తే బాగుంటుందని కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా కాసానికి అవకాశం కల్పించారు. - మంగలి సత్యం, బీసీ నాయకుడు, షాబాద్

### కాసానిని గెలిపించుకుంటాం



చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీ అభ్యర్థిని గెలుపించుకుంటేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. గతంలో బీసీలు ఏకమై ఇతర వర్గాల నాయకులను నమ్మి గెలిపించుకుంటే ద్రోహం చేశారు. అలా జరుగకుండా ఉండాలంటే బీసీ నాయకుడినే ఎన్నుకోవాలి. ఎన్నో సంవత్సరాల నుంచి బీసీ నాయకుడికి వచ్చిన చేవెళ్ల ఎంపీ అవకాశాన్ని వదులుకోవద్దు. - చాకలి లక్ష్మయ్య, ధారూరు

### బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలి



బీసీ సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ముద్దు బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని బీసీల ఐక్యతను ఢిల్లీలో చాటిచెప్పాలి. కాసాని విజయం సాధించేందుకు రాజకీయాలను పక్కన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. గతంలో అన్ని రాజకీయ పార్టీలు మన ఓట్లను రాజకీయంగా వాడుకునేవారు. ఇప్పుడు మనకు అవకాశం వచ్చింది. - బాబయ్య, అంపల్లి, ధారూరు మండలం

### బీసీ బిడ్డ కాసానిని గెలిపించుకుందాం



బీసీలను ఎన్నో ఏండ్ల నుంచి అన్ని పార్టీలు రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నాయి. తక్కువ జనాభా కలిగిన కులాలు రాజ్యాధికారం చేపడుతున్నాయి. బీసీ నాయకులు రాజకీయాల్లో ఎదగలేకపోతున్నారు. బీసీలకు అవకాశం ఇవ్వకుండా అవమానపరుస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు. కాసానికి ఎంపీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ పార్టీ సముచితస్థానం కల్పించింది. - చాకలి రాములు, పెద్దేముల్

### బీసీల సత్తా చూపిద్దాం



కాసానిని భారీ మెజార్టీతో గెలిపించి బీసీల ఐక్యతను చాటుతాం. వచ్చిన అవకాశాన్ని బడుగు వర్గాల ప్రజలు వదులుకోరాదు. ప్రజా సేవ కోసం అహర్నిశలు కృషి చేసే, బీసీల అభివృద్ధికి పాటుపడే మహా నాయకుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్. పార్టీతోపాటు నియోజకవర్గంలోని ముదిరాజ్ బిడ్డలు సంపూర్ణ మద్దతును జ్ఞానేశ్వర్‌కు ఇస్తున్నారు. - బోయిని నర్సింహులు, పెద్దేముల్

### మా సత్తా చాటుతాం



బీసీ నాయకుడిని గెలిపించి మా సత్తా చాటుతాం. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బీసీ సామాజక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. జాతీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న ఇద్దరు నాయకులు ఎంపీలుగా గెలిచి నియోజకవర్గ సమస్యలను పరిష్కారం చేయడంలో విఫలమయ్యారు.- మేకల వెంకటేశ్‌ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకుడు, శంషాబాద్

### జ్ఞానేశ్వర్‌కే మా మద్దతు



బీసీ వర్గాల ప్రతినిధి జ్ఞానేశ్వర్‌కే మా మద్దతు. 93 కులాల బీసీలను ఏకం చేసిన నాయకుడు బడుగు బలహీన వర్గాల నాయకుడి గెలుపుతోనే చేవెళ్ల అభివృద్ధి చెందుతుంది. మన ఓట్లు మన నాయకుడికి వేసుకుంటే మంచి మెజార్టీ రావడం ఖాయం. ఎంపీగా జ్ఞానేశ్వర్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే బీసీల సమస్యలపై పోరాటం చేస్తారు.- ఎల్గని ప్రభాకర్‌గౌడ్, గౌడ సంఘం నాయకుడు, శంషాబాద్

### బీసీ నాయకుడికి మద్దతుగా నిలుస్తాం



బీసీలందరం రాజకీయాలకు అతీతంగా బీసీ అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాం. చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీలు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే బీసీలంటే చిన్నచూపు చూస్తూ తమకు ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకుంటున్నారు.
- గంగాధర్, ఇజ్జత్ నగర్ కాలనీ

### బీసీల బలమేంటో నిరూపిస్తాం



చేవెళ్ల గడ్డపై బీసీ అభ్యర్థి పోటీ చేయడం గర్వంగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీ బీసీల మద్దతుతోనే అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి బీసీలను చిన్నచూపు చూస్తున్నది. బీసీ ఓటర్లందరూ మూకుమ్మడిగా కలిసి కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుదాం. చేవెళ్ల అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీసీ నాయకుడు కాసానికి భారీ మెజార్టీని అందించి మన సత్తా ఏంటో నిరూపిద్దాం.
- రాజ్‌కుమార్, గుట్టలబేగంపేట్

### బీసీల కోసం పని చేసే నాయకున్ని గెలిపియ్యాలి



ఎన్నో ఏండ్లుగా గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగా చూడటమే తప్ప రాజకీయాల్లో రాణించేందుకు అవకాశాలు కల్పించక బీసీ వర్గాల గతి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఈ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా మన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్‌ఎస్ పార్టీ అవకాశం కల్పించింది. దీన్ని బీసీలు సద్వినియోగం చేసుకొని కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి.
- ముద్దం అనంతయ్య, మాజీ స్కూల్ చైర్మన్, బొంపల్లి, దోమ మండలం

### పార్టీలకతీతంగా బీసీలంతా ఏకం కావాలి



బీసీలంతా ఏ పార్టీలో ఉన్నా పార్టీలకతీతంగా మన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలిపించుకోవాలి. 93 బీసీ కులాల అభ్యున్నతికి నిరంతరాయంగా కృషి చేస్తున్న కాసాని గెలుపునకు కృషి చేస్తాం. నేను ఈ పార్టీలో ఉన్నా.. నేను ఆ పార్టీలో ఉన్న అనే భావనను వీడి ఈ ఒక్కసారి మన జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి మనమేంటో నిరూపిద్దాం.
- నిదురం వెంకటయ్యయాదవ్, యువ నాయకుడు, వార్డు మెంబర్, బొంపల్లి

### కుర్మ సంఘం మద్దతు కాసానికే..



చేవెళ్ల పార్లమెంటు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు కుర్మ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కుర్మ సంఘం ఆధ్వర్యంలో కాసాని గెలుపు కోసం కృషి చేస్తాం. బీఆర్‌ఎస్ పార్టీ ద్వారానే కుల సంఘాలకు న్యాయం జరుగుతుంది. కుల వృత్తులు, చేతి వృత్తులు కుప్పకూలిన సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ వృత్తులకు జీవం పోశారు. - కర్రీ వెంకటేశ్, కుర్మ సంఘం నాయకుడు, బాలాపూర్ మండలం

### బీసీలు ఐక్యం కావాలి



చేవెళ్ల ఎంపీ ఎన్నిక సంపన్నులు, సామాన్యులకు మధ్య జరుగుతున్న పోటీ. బీసీలు ఒక్కటి కావలసిన సమయం ఇది. చలి చీమలు ఏకమై సర్పాలను చంపినట్లు సామాన్యులు ఏకమై సంపన్నులను కట్టడి చేయాలి. బీసీల పట్ల చులకన భావంతో మాట్లాడుతున్న వారి నోరు మూతపడాలంటే బీసీలు ఐక్యం కావాలి. - పి మురళి, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# ఈవీఎంలపై పూర్తి అవగాహన అవసరం

### వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మే 1 : ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి పీవో, ఏపీవో, ఓపీవోలను ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. పీవో, ఏపీవోలు పోలింగ్ బూత్ లలో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని సూచించారు. పోలింగ్ జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు, కంట్రోల్ యూనిట్, మాక్ పోల్ నిర్వహణ, వీవీ ప్యాట్‌లను సీల్ చేయడం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఉపయోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. పోలింగ్ రోజు ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహించి క్లోజ్ రిజల్ట్ క్లియర్ బటన్(సీఆర్‌సీ) అయ్యేదాకా పరిశీలించి తదుపరి పోలింగ్ మొదలుపెట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఫారం-12 ఫిలప్ చేసి ఇవ్వాలన్నారు. మొత్తం 250 మంది ఉద్యోగులకుగాను 231 మంది శిక్షణా తరగతులకు హాజరయ్యారని, హాజరుకానివారికి మెమోలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈవీఎం యంత్రాల నిర్వహణ, మాక్ పోల్ నిర్వహణ, పీవో డైరీ, 7ఏ, 7సీ, బుక్‌లెట్ సరిగ్గా నింపి ఎన్నికలను విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

### ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ తనిఖీ

తహసీల్దార్ కార్యాలయంలో జిల్లాకు అదనంగా కేటాయించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎంల) ఫస్ట్ లెవెల్ చెకింగ్ కొనసాగుతున్న ప్రక్రియను కలెక్టర్ ట్రైనీ కలెక్టర్ ఉమాహారతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు అదనంగా ఈవీఎంలు 2000 వచ్చాయని, రెండు రోజుల్లో ఈవీఎంల తనిఖీ పూర్తవుతుందన్నారు. ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందం(15 మంది) ఆధ్వర్యంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఎఫ్ఎల్‌సీ ముగిసిన వెంటనే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు వీలుగా ర్యాండం పద్ధతిన మాక్ పోల్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, నిబంధనలు తప్పకుండా పాటించాలని, ఓటింగ్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు

### జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతీపద్మ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతీపద్మ

వికారాబాద్, మే 1 : బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి జ్యోతీపద్మ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ లైన్ సంయుక్తంగా బాల్య వివాహాలపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి జ్యోతీపద్మ మాట్లాడుతూ.. ఈ నెలలో వచ్చే అక్షయ తృతీయ సందర్భంగా ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లుగా సమాచారం ఉంటే ముందస్తుగా అంగన్‌వాడీ టీచర్లు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఉండే ప్రజలు, పూజారులు, ఖాజీలు, పాస్టర్లు, పెళ్లి జరిగే ఫంక్షన్ హాళ్ల యజమానులు జిల్లాలోని డీసీపీయూ అధికారులకు, చైల్డ్ లైన్ సిబ్బందికి సమాచారం అందించాలని ఆమె తెలిపారు. ఒకవేళ బాల్య వివాహానికి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ఎవరైనా సహకరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఐసీడీఎస్, మిషన్ వాత్సల్య సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలనకై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గ్రామాలు, తండాల్లో జరిగే బాల్య వివాహాలను అరికట్టడానికి బాల్య వివాహ నిరోధక అధికారులకు, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. సమీక్షా సమావేశానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు శ్రీకాంత్, ఆంజనేయులు, చైల్డ్ లైన్ ప్రతినిధి రాజూనాయక్, కోఆర్డినేటర్ బలరాం నాయక్, సఖి ప్రతినిధి యశోద, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

# బాలికను రేప్ చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష

### రూ.40వేల జరిమానా విధించిన ఫస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు

చేవెళ్లటౌన్, మే 1 : బాలికను రేప్ చేసిన ఓ వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష రూ.40వేల జరిమానా విధించినట్లు ఎల్బీనగర్ ఫస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి హరీష తీర్పు వెలువరించారని చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు. బుధవారం చేవెళ్లలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వివరించారు. 2017 ఫిబ్రవరి 22న అప్పటి చేవెళ్ల సీఐ గురువయ్య రేప్, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం కిష్టపూర్ గ్రామానికి చెందిన రత్నయ్య అలియాస్ రత్నం, ఓ బాలిక సెల్‌ఫోన్ ద్వారా పరిచయమయ్యారు. వికారాబాద్ జిల్లాకు చెందిన ఆ బాలిక నిత్యం చేవెళ్ల బస్ స్టేషన్ వేదికగా చేసుకుని మాట్లాడుకునేవారు. అక్కడి నుంచి యాదగిరిగుట్ట తదితర ప్రాంతాల్లో సంచరించేవారు. అద్దెకు గదిని తీసుకుని కొన్నాళ్ల పాటు అక్కడక్కడ కూడా ఉండేవారు. ఈ క్రమంలో శారీరక సంబంధానికి దారితీయడంతో ఆమె గర్భం దాల్చింది. పలుమార్లు ఆ బాలిక తనను పెళ్లి చేసుకోవాలని కోరినా రత్నం అందుకు అంగీకరించపోవడంతో బాలిక చేవెళ్ల పోలీస్ స్టేషల్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి చేవెళ్ల సీఐ గురువయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీగా వివరాలను సేకరించారు. ఎల్బీనగర్ ఫస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టులో ట్రయల్ నడిచింది. ఏప్రిల్ 30న తీర్పు వెలువరించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోమలత, కోర్టు కానిస్టేబుల్ సాక్షులను ఫస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు సమర్పించడంతో జడ్జీ ఈ తీర్పునిచ్చారు. నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.40వేల జరిమానా విధించారు. కొత్త వ్యక్తులను నమ్మి మోసపోవద్దని.. అప్రమత్తంగా ఆండాలని పిలుపునిచ్చారు. చిన్నదే అని క్యాజువల్‌గా తీసుకోవద్దన్నారు. మహిళలు, యువతులు, మైనర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమావేశంలో చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్సై ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

# ఓటర్లు సీ విజిల్ ద్వారా ఫిర్యాదులు అందించవచ్చు



తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్, మే 1 : ఓటర్లు సీ విజిల్ ద్వారా ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు అందించవచ్చని జనరల్ అబ్జర్వర్ త్సెవాంగ్ గౌచో భూటియా, వ్యవ పరిశీలకుడు వరుణ్ రంగస్వామి తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో భాగంగా కొడంగల్‌కు విచ్చేసిన వారు ఈవీఎం స్ట్రాంగ్ రూంలతో పాటు పోలింగ్ కేంద్రాలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలతో పాటు బార్డర్ చెక్ పోస్టులను తనిఖీ చేసి వివరాలను తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వో, సెక్టార్ అధికారులతో ఓటరు స్లిప్పుల పంపిణీపై ఆరా తీశారు. అభ్యర్థుల నిర్వహించుకునే మీటింగ్‌లకు లౌడ్ స్పీకర్స్, వాహనాలు ఇతరత్రా ఎన్నికల ప్రచారానికిగాను విధిగా సువిధ ఆప్ ద్వారా అనుమతులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, సలహాలు, సూచనల కోసం కంట్రోల్ రూం నం.08505 284080ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులందరూ విధిగా కృషి చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకోబడతాయని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీటీ సురేశ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

### వికారాబాద్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్, మే 1 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం వికారాబాద్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఎంపీ ఎన్నికలను పురస్కరించుకొని వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఎన్నికలు సాఫీగా, సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొని స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పార్టీల ప్రతినిధుల సహకారం అవసరమని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సౌకర్యాలతో పాటు వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీరు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఎం రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ అనిత పాల్గొన్నారు.

# ధాన్యంలో తాలు లేకుండా చూడాలి

### డీఏవో గోపాల్



మెట్లకుంట ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీఏవో గోపాల్

బొంరాస్‌పేట, మే 1 : రైతులు పండించిన ధాన్యంలో తాలు లేకుండా చూసుకోవాలని, ధాన్యాన్ని తూర్పారా పట్టిన తరువాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని మెట్లకుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించారు. 17 శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆయన సూచించారు. ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలని రైతులకు డీఏవో సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, సక్రమంగా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కొడంగల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు శంకర్ రాథోడ్, ఏఈవో భార్గవి పాల్గొన్నారు.

# 'ఎర్లీబర్డ్'.. శేరిలింగంపల్లి టాప్

### చాంద్రాయణగుట్ట లాస్ట్




సిటీబ్యూరో, మే 1, (నమస్తే తెలంగాణ) : ముందుస్తుగా ఆస్తిపన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందాలంటూ ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు జీహెచ్‌ఎంసీ ఇచ్చిన అవకాశాన్ని యజమానులు చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. 30 సర్కిళ్ల పరిధిలో రూ. 800 కోట్ల నిర్దేశిత లక్ష్యాన్ని ఖరారు చేయగా, బల్దియాకు రూ.827 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఎర్లీబర్డ్‌ను జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా 7,34,837 మంది సద్వినియోగం చేసుకుంటే.. అందులో శేరిలింగంపల్లి సర్కిల్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ సర్కిల్ నుంచి 58,512 మంది సద్వినియోగం చేసుకోగా, రూ.109.23కోట్ల మేర ఆదాయం వచ్చింది. రెండో స్థానంలో జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 27,074 మంది నుంచి రూ.8450.82 లక్షలు, ఆ తర్వాత ఖైరతాబాద్ సర్కిల్‌లో 30,849 మంది నుంచి రూ. 6903.51 లక్షల ఆస్తిపన్ను వసూలైంది. చందానగర్ సర్కిల్‌లో 50,529 మంది సద్వినియోగం చేసుకోగా, రూ. 5297.44 లక్షల ఆస్తిపన్ను వసూలైంది. ఎర్లీబర్డ్ స్కీంను అతి తక్కువగా చాంద్రాయణగుట్టలో కేవలం 6,270 మంది, ఆ తర్వాత ఫలక్‌నుమా సర్కిల్‌లో 6,895 మంది మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు.

# ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజుకు నేడే చివరి తేది

### జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్



వికారాబాద్, మే 1 : ఇంటర్మీడియట్ సప్లీమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు మే 2 లోగా పరీక్ష ఫీజు సంబంధిత కళాశాలలో చెల్లించాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి ఎన్.శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిలైన విద్యార్థులు, సబ్జెక్టు ఇంప్రూవ్‌మెంట్ రాసే విద్యార్థులు, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు అప్లై చేసుకునే విద్యార్థులు మే 2 లోగా ఆన్‌లైన్ లో మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

# 4 గంటలు నరకమే..

### ముందస్తు సమాచారం లేకుండా..రోడ్లు బ్లాక్
### గంటల పాటు ట్రాఫిక్‌లో సామాన్యుల విలవిల
### రాచకొండ పోలీసుల నిర్లక్ష్యం..
### ప్రయాణికుల ఆగ్రహం

సిటీబ్యూరో, మే 1 (నమస్తే తెలంగాణ) : ముందస్తు సమాచారం లేకుండా ఎక్కడికక్కడ రాచకొండలో రోడ్లు బ్లాక్ చేస్తుండటంతో ట్రాఫిక్‌లో చిక్కుకొని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీలు ప్రచారాల కోసం ముందస్తుగానే అనుమతికి దరఖాస్తు చేయడం, ఆయా రూట్లలో పోలీసులు అనుమతులివ్వడం సాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే ప్రముఖుల ప్రచారాల సందర్భంలో సభలు, సమావేశాలు జరిగే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా పోలీసులు మందస్తుగానే పరిగణనలోకి తీసుకుంటారు. ఇందులో భాగంగా ప్రధానంగా సామాన్యులు ఇబ్బందులు పడకుండా ఉండేలా ఏ రోజు ఏ పార్టీ మీటింగ్ ఉంటుందో.. ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామంటూ.. ముందస్తుగా ప్రకటనలు జారీ చేస్తుంటారు. హైదరాబాద్, సైబరాబాద్‌లో ఇలాంటి ముందస్తు ప్రకటనలు వస్తున్నా.. కొన్ని సందర్భాల్లో రాచకొండలో ఈ విధానం అమలు కావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేట్ పరిసరాల్లో మంగళవారం రాత్రి ఆయా పార్టీల కార్నర్ మీటింగ్‌లు జరిగాయి. దీంతో ప్రధాన రోడ్లన్నీ ఎక్కడికక్కడే జామ్ అయ్యాయి. బెంగళూర్ హైవేకు వెళ్లేవారు తుక్కుగూడ ఔటర్ మీదుగా పాలమాకులకు వెళ్లి అక్కడి నుంచి హైవేకు వెళ్తారు. ఈ కారణంగా బాలాపూర్, ఆర్‌సీఐ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. మంగళవారం ఆ రూట్‌లో వచ్చే వారికి అక్కడ మీటింగ్‌లు జరుగుతున్నాయని, రహదారులను మూసివేశారనే విషయం తెలియదు. ఏదో సాధారణ ట్రాఫిక్ జామ్‌గా భావించి.. చాలా మంది కొద్దిసేపు ఎక్కడికక్కడే ఆగారు. అరగంట, గంట.. రెండు, నాలుగు గంటలు.. ఇలా ఆ రోడ్డుపైనే ఉండాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కడ్తాల్ నుంచి హైదరాబాద్‌కు కుటుంబంతో వస్తున్న వైద్యుడు రమేశ్ 'ఇదేం బాధరా బాబు.. కనీసం ముందస్తు సమాచారం లేదు.. ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి.. పోలీసులను అడిగితే ఆగాలంటూ హుకూం జారీ చేస్తూ ఇబ్బందిపెట్టారు. కుటుంబంతో నాలుగు గంటలు కారులోనే ఉండాల్సి వచ్చింది'.. అంటూ వాపోయారు. వ్యాపారి రత్నాకర్‌రెడ్డి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి, పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరు కాదు.. వేలాది వాహనాలు ఇలా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి. ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉంటే.. ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదంటూ.. వాపోయారు.